సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 26 | సెప్టెంబర్ | 2023



కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లు - 8లో

సీఎం కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లు అని, రాష్ట్రంలో వారికి సముచిత స్థానం లభించిందని మంత్రి సత్యవతి అన్నారు.



పెంబర్తికి బెస్ట్ టూరిజం అవార్డు - 8లో

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జనగామ జిల్లాలోని పెంబర్తి ని బెస్ట్ టూరిజం విలేజ్‌గా ఎంపిక చేసింది.

గరిష్ఠం/కనిష్ఠం
31°/25°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఏలకు పదోన్నతులు

విద్యారణ్యపురి: మల్టీజోన్‌–1లోని 19 జిల్లాల్లో ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎం గ్రేడ్‌–2లుగా పదోన్నతులు కల్పించారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇందుకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. 19 జిల్లాల్లో 1,093 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఉండగా.. ఇటీవల స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఇందులో లోకల్‌బాడీలో 995 మంది, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 99 మందికి పదోన్నతులు కల్పించారు. వద్దనుకునేవారికి నాట్ విల్లింగ్‌కు కూడా అవకాశం ఇచ్చారు. పదోన్నతులు పొందుతున్నవారు జాయిన్ అవుతున్నారు.

స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ జరగనుంది. అందుకు జిల్లాల్లో సంబంధిత స్కూల్ అసిస్టెంట్లకు సీనియార్టీ జాబితాలను, వేకెన్సీల జాబితాను వెల్లడించాల్సి ఉంది. ఆతర్వాత జిల్లాల వారీగానే స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈబదిలీల తర్వాత ఎస్జీటీల్లో అర్హులైన వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియ జరగనుంది.

పీహెచ్‌సీలకు నాణ్యతా ప్రమాణాల అవార్డు



ఎంజీఎం: హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు, గోపాల్‌పూర్ పీహెచ్‌సీలకు జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు లభించినట్లు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తెలిపారు. ఆగస్టులో జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ అరుణ్ త్రివేది, ప్రశాంత్ సత్యదిల్ కప్సె ఆత్మకూరు, గోపాల్‌పూర్ పీహెచ్‌సీలను సందర్శించి సేవలను పరిశీలించారు. పీహెచ్‌సీలో వసతులు, జాతీయ కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం అధికారులు పీహెచ్‌సీలను పర్యవేక్షించే విధానాలను కలెక్టర్ ఆదేశాల కమిటీ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరిన్ని పీహెచ్‌సీలకు గుర్తింపు లభించేలా సేవలందిస్తామని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు స్పష్టం చేశారు.

28న ఎస్‌జీఎఫ్‌ఐ ఫుట్‌బాల్ సెలక్షన్స్

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు ఈనెల 28న వరంగల్‌లోని లాల్‌బహదూర్ జూనియర్ కళాశాలలో అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఐఈఓ ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ వెంట ఎలిజిబిలిటీ ఫామ్, లేదా కళాశాల గుర్తింపు ఐడెంటిటీ కార్డు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని కామర్స్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, ఆకళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆచార్య నర్సింహాచారి, పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ రాధిక పరిశీలించారు.

ఐదేళ్ల లా పరీక్షలు కూడా..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల లా కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు కూడా సోమవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని సీకేఎం కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ పరిశీలించారు. ఆయన వెంట కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రమేశ్ ఉన్నారు.

కమీషన్ వ్యాపారులకు నోటీసులిస్తున్నాం..

సాక్షి స్పందన

వరంగల్: 'లక్ష్మీపురంలో వ్యాపారుల దోపిడీ' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. అధిక కమీషన్ వసూలు చేస్తున్న వ్యాపారులకు నోటీసులిస్తున్నామని మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్ అన్నారు. కూరగాయల మార్కెట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సూపర్‌వైజర్లు ప్రతీ షాపు వద్దకు వెళ్లి కమీషన్ వసూళ్లు, తక్‌పట్టీలపై ఆరా తీసినట్లు ఆయన పేర్కొన్నారు. అధిక కమీషన్ వసూళ్లకు పాల్పడుతున్న వ్యాపారుల లైసెన్సులు రద్దు చేసేందుకు వెనుకాడేది లేదన్నారు. కమీషన్ ఎక్కువ చెల్లించవద్దని మైకుల ద్వారా అనౌన్స్‌మెంట్ చేస్తున్నట్లు రాహుల్ తెలిపారు.

ఇంకా.. తేల్చరేమి..?



కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఖరారుపై వీడని సస్పెన్స్

- టికెట్ రేసులో ఆశావహులు.. పెరుగుతున్న ఉత్కంఠ
- వచ్చే ఎన్నికల్లో పోటీకి వెల్లువెత్తిన దరఖాస్తులు
- కాంగ్రెస్ నుంచి 104, బీజేపీ నుంచి 119 మంది
- ముంచుకొస్తున్న ఎన్నికల ముహూర్తం..
- హైదరాబాద్, ఢిల్లీ చుట్టూ ఆశావహుల చక్కర్లు
- ఇప్పటికే 11 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

ముంచుకొస్తున్న ఎన్నికల ముహూర్తం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆశావహులను ఆందోళనకు గురిచేస్తోంది. బీఆర్‌ఎస్ ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌లోని 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక.. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్, బీజేపీలు ఇంకా ఏమీ తేల్చలేదు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి 12 నియోజకవర్గాల నుంచి 104 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య 119గా ఉంది. ఈ మేరకు టీపీసీసీ అధిష్టానం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి స్క్రీనింగ్ కోసం పేర్లను పంపింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ముఖ్యనేతలతో చర్చించి పలువురి పేర్లను హైకమాండ్ పరిశీలనకు తీసుకెళ్లారు. ఈప్రక్రియ జరిగి పది రోజులు కావొస్తున్నా.. అభ్యర్థులను ఇంకా తేల్చలేదు. దీంతో వీడని సస్పెన్స్, ఉత్కంఠతో ఆశావహులు హైదరాబాద్, ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

కాంగ్రెస్‌లో మూడింట స్పష్టత, తొమ్మిదింటిపై వడపోత..

టీపీసీసీ, ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ.. అభ్యర్థులను వడపోసి కొందరి పేర్లు ఖరారు చేసిందన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్‌కు సంబంధించి 12 స్థానాలకుగాను ములుగు నుంచి ధనసరి సీతక్క, భూపాలపల్లి నుంచి గండ్ర సత్యనారాయణ, నర్సంపేట నుంచి దొంతి మాధవరెడ్డి పేర్లు దాదాపుగా ఖరారైనట్లేనని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఆ మూడు నియోజకవర్గాల నుంచి ఒక్కో పేరే స్క్రీనింగ్ కమిటీ పరిశీలనలోకి తీసుకుందంటున్నారు.

- మహబూబాబాద్ నుంచి ఉమా మురళీ నాయక్, బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, డోర్నకల్ నుంచి డాక్టర్ రామచంద్రునాయక్, నెహ్రూ నాయక్, భూపాల్‌నాయక్, జనగామకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, స్టేషన్ ఘన్‌పూర్‌కు శనిగరం ఇందిర, దొమ్మాటి సాంబయ్య, వరంగల్ పశ్చిమకు నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణ, డాక్టర్ కత్తి వెంకటస్వామి పేర్లు స్క్రీనింగ్ కమిటీ పరిశీలనకు వెళ్లినట్లు పార్టీవర్గాల సమాచారం.
- వర్ధన్నపేట నుంచి సిరిసిల్ల రాజయ్య, కేఆర్.నాగరాజు, నమిండ్ల శ్రీనివాస్, పరంజ్యోతి, పరకాలకు ఇనగాల వెంకట్రామిరెడ్డి, కొండా మురళి, పాలకుర్తి నుంచి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎ.తిరుపతిరెడ్డి, బండి సుధాకర్ పేర్లపై కసరత్తు జరుగుతోందని సమాచారం.
- ఇప్పటికే చాలా మంది ఆశావహులు హైదరాబాద్, ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ, టీపీసీసీ నేతలను కలిసినట్లు ప్రచారం. కాగా.. అభ్యర్థుల ఖరారు ప్రకటన ఎప్పుడు వెలువడుతుందోనన్న ఉత్కంఠ అందరినీ వెంటాడుతోంది.

దీటైన అభ్యర్థులు.. కీలకం కానున్న నివేదికలు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు దీటుగా తమ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఇప్పటికే బీజేపీ ప్రకటించింది. బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా విజయం తమదేనని కాంగ్రెస్ చెబుతోంది. మూడోసారి విజయం, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ అంటోంది. ఈ క్రమంలో ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. ఆ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టే సామర్థ్యం గల నేతల కోసం కాంగ్రెస్, బీజేపీ గాలిస్తున్నాయి. ఈక్రమంలో ఆ రెండు పార్టీలు పోటాపోటీగా సర్వేలు నిర్వహిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 12 స్థానాల నుంచి ముక్కోణపు పోటీ అనివార్యం కానున్న నేపథ్యంలో తమ బలాలను ప్రదర్శించే పనిలో పార్టీలున్నాయి. సర్వే నివేదికలు కూడా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

'కమలం' అందేదెవరికో..

- భారతీయ జనతా పార్టీ నేతలు గతంలో ఎన్నడూ లేని విధంగా కదనానికి కాలు దువ్వుతున్నారు. 12 స్థానాల నుంచి 119 మంది దరఖాస్తు చేసుకున్నారు. సమయానికి దరఖాస్తు చేసుకోని వారు సైతం టికెట్ కోసం పోటీ పడుతున్నారు.
- వరంగల్ పశ్చిమ నుంచి రావు పద్మ,ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావుల పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.
- వరంగల్ తూర్పునుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంట రవికుమార్, కుసుమ సతీశ్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, నర్సంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావులు ఉన్నారు.
- భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి, కటంగూరి రాంనర్సింహారెడ్డి, సుంకరి మనోహర్, వేముల రాజాగౌడ్, లింగంపల్లి వీరగోపాల్, దాసరి కిరణ్‌లు టికెట్ ఆశిస్తుండగా.. కీర్తిరెడ్డి, నర్సింహారెడ్డిల పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.
- వర్ధన్నపేట నుంచి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జన్ను మధు, పోలేపాక మార్టిన్ లూథర్‌లు, జనగామ నుంచి ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.
- డోర్నకల్ నుంచి లక్ష్మణ్‌నాయక్, నర్సింహులపేట జెడ్పీటీసీ సభ్యురాలు సంగీత, మదన్‌లాల్, గుగులోతు దేవిక, బుల్లెట్ కృష్ణ టికెట్, పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, డాక్టర్ కాళీ ప్రసాదరావు, డాక్టర్ విజయచందర్, పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి, కర్ర శ్రీనివాసరెడ్డి, పాకనాటి దామోదర్‌రెడ్డిల పేర్లపై పార్టీలో చర్చ జరుగుతోంది.
- స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, బొజ్జపల్లి సుభాష్, ములుగు నుంచి ఇటీవల పార్టీలో చేరిన మాజీమంత్రి చందూలాల్ కుమారుడు అజ్మీరా ప్రహ్లాద్, కృష్ణవేణి నాయక్, భూక్య జవహర్‌లాల్ తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.
- మహబూబాబాద్ నుంచి యాప సీతయ్య, జాటోత్ హుస్సేన్ నాయక్, యల్ది నాగలక్ష్మి, బాలునాయక్, వెంకన్నల పేర్లున్నాయి.

హలో సీఎంహెచ్‌ఓ




ఎం.రాజేశ్, సీఎంహెచ్‌ఓ

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పరిధిలో ప్రజలు పారిశుద్ధ్య సమస్యను నిత్యం ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు **మురుగు కాల్వల శుభ్రత, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండడం, ముళ్ల కంపలు, పొదలు, దోమకాట్లు** తదితర సమస్యలను గ్రేటర్ వరంగల్ ముఖ్య ప్రజారోగ్య అధికారి (సీఎంహెచ్‌ఓ) ఎం.రాజేశ్ దృష్టికి తీసుకువచ్చే అవకాశాన్ని 'సాక్షి' కల్పించింది. ఇందుకోసం నేడు(మంగళవారం) ఉదయం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. బల్దియా పరిధిలోని ప్రజలు వారి సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందవచ్చు.

నేడు (మంగళవారం)
ఫోన్ చేయాల్సిన నంబర్లు :
98494 32144, 97019 99689
సమయం :
ఉదయం 11.00-12 గంటల వరకు

మెట్లబావి పరిశీలన



శివలింగానికి పూజలు చేసిన స్థానికులు

ఖిలా వరంగల్: మెట్ల బావిని బల్దియా, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామితో కలిసి సాంకేతిక నిపుణులు సోమవారం సందర్శించారు. బావి ప్రాంగణంలోని మట్టిని సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ప్రణాళిక ప్రకారం త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని సాంకేతిక నిపుణులు తెలిపారు. కార్యక్రమంలో బల్దియా ఏఈ, జవాన్లు కుమారస్వామి, బిల్ల రాజు, సతీశ్ పాల్గొన్నారు.

బయటపడిన శివలింగం

మెట్లబావి ప్రాంగణంలో రాత్రి శివలింగం బయటపడింది. స్థానికులు పూజలు చేశారు.

అర్హులకు త్వరలో డబుల్ బెడ్రూమ్‌లు

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- దూపకుంటలో అధికారులతో కలిసి డబుల్ బెడ్రూమ్‌ల పరిశీలన



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ బాషా

ఖిలా వరంగల్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను అందిస్తామని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఈమేరకు సోమవారం ఖిలా వరంగల్ శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు, మ్యాప్‌ను ఎమ్మెల్యే నరేందర్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈసందర్భంగా డబుల్ బెడ్రూంల పరిసరాలు, నిర్మాణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, గ్రీనరీ వంటి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి, బల్దియా ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎన్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై పటిష్ట కార్యాచరణ





వీసీలో పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హన్మకొండ అర్బన్: నూతన ఓటర్ల నమోదు అంశంపై పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సోమవారం జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి ఆయన అసెంబ్లీ ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం.. జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించి నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. విద్యాసంస్థల్లో ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓటర్ల నమోదు చేపడుతున్నామన్నారు. నిర్దేశిత సమయంలోగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ రమేశ్, స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కరించండి..

కరీమాబాద్: జిల్లాలోని రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, వీటిపై ఈఆర్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమెతో పాటు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

వరంగల్ జిల్లాలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న మూడో లైన్‌కు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి జాతీయ రహదారులు, భవనాల శాఖ కేంద్ర కేబినెట్ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాజీపేట నుంచి విజయవాడ వరకు మూడో లైన్ కోసం 4.57 హెక్టార్ల భూ సేకరణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉందన్నారు. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, జాతీయ రహదారుల నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ పెండింగ్‌లో ఉందన్నారు.

నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు చేయండి

- మేయర్ సుధారాణి, కమిషనర్ బాషా
- క్షేత్రస్థాయిలో నిమజ్జన కేంద్రాల పరిశీలన



చిన్న వడ్డేపల్లి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్, అధికారులు

వరంగల్ అర్బన్: గణేశ్ నిమజ్జనానికి విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులతో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో నిమజ్జన కేంద్రాలను పరిశీలించారు. కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, ఉర్సు చెరువు, బెస్తం చెరువు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, గజ ఈతగాళ్లను, బోట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెరువులో గుర్రపు డెక్క తొలగించాలని, పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నిమజ్జనం విజయవంతంగా పూర్తి చేయాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. హనుమకొండ, వరంగల్‌లోని 24 నిమజ్జన ప్రాంతాల్లో 24 క్రేన్‌లు, ప్రత్యేకంగా హైదరాబాద్‌లో ఉపయోగించే 2 భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుంకరి మనీష శివ కుమార్, మరుపల్ల రవి, గుండు చందన పూర్ణ చందర్, అరుణ విక్టర్, బల్దియా ఎస్‌ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈలు సంజయ్, శ్రీనివాస్, డీఈ రవికిరణ్, ఏఈలు హబీబ్, సంతోశ్, నరేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధరమ్ సింగ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నియామకం

గ్రేటర్ వరంగల్ పరిధి 21 చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు బల్దియా ఇంజనీర్లకు నిమజ్జన కేంద్రాల్లో ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాలు జారీ చేశారు.

- డీఈ సంతోశ్‌బాబుకు కాజీపేట బంధం చెరువు, కడిపికొండ, రాంపేట, రాంపూర్, సింగారం చెరువులు అప్పగించారు. డీఈ రవికుమార్‌కు హసన్‌పర్తి పెద్ద చెరువు, గోపాలపురం, భీమారం, ఎల్లాపూర్, వంగపహాడ్, గుండ్ల సింగారం చెరువులు అప్పగించారు.
- డీఈ శివానందంకు సొమిడి చెరువు, మడికొండ చెరువుల బాధ్యతలు కట్టబెట్టారు. వరంగల్ ప్రాంతంలో డీఈ సారంగంకు కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, ఖిలా వరంగల్ అగర్తలా, బెస్తాం చెరువు, మామునూరు, తిమ్మాపూర్ చెరువులు కేటాయించారు. డీఈ రవికుమార్‌కు ఉర్సురంగ సముద్రం చెరువును అప్పగించారు. వీరే కాకుండా ఈఈ శ్రీనివాస్, రాజయ్య, బీఎల్ శ్రీనివాస్‌తోపాటు ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్‌కుమార్, ఏఈలు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. వీరికి సహాయకులుగా ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తారు.

స్మార్ట్‌సిటీ సదస్సుకు మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న సదస్సుకు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హాజరుకానున్నారు. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ అఫైర్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న 100 స్మార్ట్ నగరాల మేయర్లు, కమిషనర్లను డైరెక్టర్, జాయింట్ సెక్రటరీ కునాల్ కుమార్ ఆహ్వానించారు. ఈనేపథ్యంలో మేయర్, కమిషనర్ సోమవారం బయల్దేరి వెళ్లారు.

డ్రెయినేజీలో మొక్కల తొలగింపు



బాపూజీనగర్ డ్రెయినేజీలో పిచ్చి మొక్కలను తొలగించిన పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి స్పందన

కాజీపేట రూరల్: ఈనెల 24న ప్రచురితమైన 'పారిశుద్ధ్య వ్యవస్థ.. ప్రజల అవస్థ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన 'మొక్కలు మొలిచి.. నీళ్లు నిలిచి' అనే కథనానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ (బూడిది గడ్డ) ప్రాంతం డ్రెయినేజీలో పెరిగిన మొక్కలను సోమవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.

సహకార సంఘాలతో పరస్పర సహాయం

- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: సభ్యుల మధ్య పరస్పర సహకారం, సహాయం చేసుకునేందుకు సహకార సంఘం మంచి వేదిక అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ సహకార సంఘం కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఇందులో వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సహకార సంఘాల అభివృద్ధే ధ్యేయంగా, బలోపేతానికి కృషి చేస్తున్నానన్నారు. నూతన సంఘాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ సొసైటీకి తన వేతనం నుంచి రూ.1,16,000 ప్రోత్సాహక సాయంగా అందించారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, ప్రిన్సిపాల్ యాకూబ్, రిటైర్డ్ పోలీస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జీఓ 142 రద్దు చేయాలని ధర్నా

ఎంజీఎం: జీఓ 142ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్యశాఖలోని డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల అసోసియేషన్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా జీఓ రద్దు పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ సభ్యులు నెహ్రూ చందు, యాదానాయక్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య రంగానికి గొడ్డలి పెట్టుగా ఉన్న జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4వేలకు పైగా పోస్టులు రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 5లోపు జీఓ రద్దు చేయకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌రావుకు వినతి పత్రం అందించారు. ధర్నాలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్ పాషా, వైద్యాధికారులు ప్రకాశ్, గోపాల్‌రావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డెమో అశోక్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి మహేందర్‌పై 2015 సంవత్సరంలో గృహహింస కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో వాదోప వాదాలు విన్న పరకాల మేజిస్ట్రేట్ లింగం శాలిని.. సోమవారం మహేందర్‌కు 5 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. మహేందర్ తన భార్య అరుణను పలు కారణాలతో వేధించాడు. దీంతో ఆమె 2015లో పోలీసులకు ఫిర్యాదు చేయగా గృహహింస కేసు నమోదు చేశారు. అనంతరం చార్జ్ షీట్ ఫైల్ చేసి పరకాల కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ కేసు పూర్వాపరాలు విన్న మేజిస్ట్రేట్ లింగం శాలిని మహేందర్‌కు 5 సంవత్సరాల జైలు శిక్ష రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. కాగా, సాక్షులను విచారించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కర్రు రుధిర, అర్జకుమార్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ జె శ్రీనివాస్, ఏసీపీ కిశోర్‌కుమార్, శాయంపేట సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్‌ను మేజిస్ట్రేట్ ఈ సందర్భంగా అభినందించారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు 9 నామినేషన్లు

వరంగల్ లీగల్ : ఉమ్మడి జిల్లా న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘంలోని నాలుగు డైరెక్టర్ల స్థానాల ఎన్నికల కోసం 9 నామినేషన్లు దాఖలైనట్లు సొసైటీ కార్యదర్శి వి.రాజ్‌కరుణాకర్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరిగినట్లు పేర్కొన్నారు. నామినేషన్లు వేసిన వారిలో భిక్షపతి, ఏవం గేళినే అలుపుల, వి. కోటేశ్వర్‌రావు, యు.కృష్ణారావు, సీహెచ్. రమేష్, టీవీ రత్నా, పి.శ్రీనివాస్, ఎన్.సురేందర్, సిద్దం యుగేంధర్ ఉన్నట్లు వివరించారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల విరమణ, సాయంత్రం 4 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈనెల 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, అదే రోజు ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


కుమార్(ఫైల్)

తొర్రూరు రూరల్: చేపలు పట్టేందుకు వాగులో దిగిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని గుర్తూరుకు చెందిన పిల్లి కుమార్ (37) ఈ నెల 23న చేపలు పట్టేందుకు గ్రామశివారులోని ఆకేరు వాగుకు వెళ్లాడు. ఆ రోజు సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆకేరువాగులో కుమార్ శవమై తేలాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెంబర్తికి బెస్ట్ టూరిజం అవార్డు

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 27న అవార్డు ప్రదానం
- హస్తకళలకు దక్కిన మరో గౌరవం

జనగామ : హస్త కళలకు నిలయమైన పెంబర్తి ఒకప్పుడు కుగ్రామం. నేడు అద్భుత నగిషీలు తయారు చేసే కర్మాగారంగా విలసిల్లుతోంది. ఈ క్రమంలో ఈ గ్రామానికి అరుదైన అవార్డు లభించింది. విశ్వకర్మ కులానికి చెందిన సుమారు 200 మందికి పైగా కళాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందుతున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి రెండు ఉత్తమ గ్రామాలను ఎంపిక చేయగా.. అందులో జనగామ మండలం పెంబర్తి ఒకటి. బెస్ట్ టూరిజం విలేజ్‌గా ఎంపికైన ఈ గ్రామంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


కళాఖండాలు తయారు చేస్తున్న కళాకారులు

1968లో విశ్వకర్మ సొసైటీ ఏర్పాటు

పెంబర్తిలో విశ్వకర్మ కళాకారులు మొదట్లో ఇత్తడి బిందెలు, కొప్పెర్లు తయారు చేసి కుటుంబాలను పోషించుకునే వారు. కాలానుగుణంగా పనికి పదును పెట్టి వివిధ రూపాల్లో నగిషీలను తీర్చిదిద్దడం ప్రారంభించారు. హస్తకళలకు ఒక రూపం ఇచ్చి గ్రామాన్ని కేంద్ర బిందువుగా నిలిపారు. నాటి నిజాం నవాబు పాలనలో వెండితో తయారు చేసిన కళాఖండాలను సామాన్యులు కొనలేని పరిస్థితుల్లో 'ఐలా' మదిలో మెదిలిన ఆలోచనే నేటి బ్రాస్ సొసైటీకి పునాది. తన గురువు మల్యాల వీరాచారి శిక్షణలో దివంగత ఐలా ఆచారి 1968లో గ్రామంలో 'విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ లిమిటెడ్ సొసైటీ'ని స్థాపించారు. మొదట ఐదుగురు కార్మికులతో ప్రారంభమైన శిక్షణ వందకు చేరి.. నేడు ఎన్నో వందల కుటుంబాలకు ఉపాధిగా నిలుస్తోంది. వంట పాత్రలతో పాటు అత్తర్‌దాన్, పాన్‌దార్, వగన్‌దాన్ ఇలా ఎన్నో కళాఖండాలు ఆయన చేతిలో రూపుదిద్దుకున్నాయి. సొసైటీ మొదటి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఐలాఆచారి కళాకారుల అభ్యున్నతికి పాటుపడుతూనే.. పెంబర్తి హస్తకళలను ప్రపంచానికి పరిచయం చేశారు.

27న అవార్డుల ప్రదానం

ఈ నెల 27వ తేదీన న్యూఢిల్లీలోని భారత మండపంలో ఉదయం 10 గంటలకు జరిగే వేడుకల్లో జిల్లా తరుపున ఓ అధికారితో పాటు గ్రామానికి చెందిన ఓ ప్రముఖుడు అవార్డును అందుకోనున్నారు. దేశంలోని 31 రాష్ట్రాలు/ యూటీల నుంచి బెస్ట్ టూరిజం విలేజ్ కాంపిటీషన్-2023 విభాగంలో 795 దరఖాస్తులు రాగా, తెలంగాణ నుంచి పెంబర్తితో పాటు మరో గ్రామం ఈ అవార్డుకు ఎంపికైంది. మూడు నెలల క్రితం భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ టూరిజం గ్రామాల ఎంపిక కోసం ఈ ఏడాది జూన్ 6వ తేదీన కేంద్ర బృందం పెంబర్తిలో పర్యటించింది.

సంతోషంగా ఉంది



జాతీయ స్థాయిలో బెస్ట్ టూరిజం విలేజ్‌గా పెంబర్తి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇక్కడి కళాకారులు తయారు చేసే ఖండాలు అద్భుతం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పెంబర్తి కళాఖండాలకు డిమాండ్, పేరు ఉంది. ఈ నెల 27వ తేదీన న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమానికి జిల్లాకు చెందిన పర్యాటక శాఖ అధికారితో పాటు గ్రామం నుంచి ఒకరు హాజరవుతారు. ఇందుకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ మంగళవారం వరకు తెలుపుతాం.

– శివలింగయ్య, కలెక్టర్, జనగామ

నగిషీలకు డిమాండ్

పెంబర్తి కళాకారులు తయారు చేసిన నగిషీలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. చూడగానే మనసును కట్టిపడేసేలా కనిపించే నగిషీలకు ప్రతి ఒక్కరూ మంత్రముగ్ధులు కావాల్సిందే. రూ.2 వందల నుంచి మొదలు.. రూ.లక్షల విలువ చేసే కళాఖండాలు ఇక్కడ తయారు చేస్తారు.

ఎంపిక ఇలా

హస్తకళలకు పుట్టినిల్లు పెంబర్తి. జాతీయ రహదారి, రైల్వే మార్గం ఉన్న ఈ గ్రామంలో గ్రీనరీకి పెద్దపీట వేస్తున్నారు. అలాగే, హస్తకళ తయారీలో అంతర్జాతీయ గుర్తింపు, స్వచ్ఛత, ప్రజలకు మౌలిక వసతులు.. ఈ అంశాలు గ్రామానికి బెస్ట్ విలేజ్ అవార్డు రావడం ముఖ్యపాత్ర పోషించాయి.

అవార్డులకు పెట్టింది పేరు..

పెంబర్తి హస్త కళాకారుల ప్రతిభను గుర్తించిన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవార్డులు ప్రకటించి సత్కరించాయి. 1990లో హస్తకళల విభాగంలో ఐలా ఆచారి అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ చేతులు మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. 1981లో జాజర్ల నాగరాజుచారి, ఐలా బట్టి మల్లయ్యకు జాతీయ అవార్డులు లభించాయి. తర్వాత రుద్రోజు రామ్మోహనాచారి, రంగు వెంకటేశ్వర్లు, రుద్రోజు శ్రీనివాసాచారిని అవార్డులు వరించాయి. 1985లో జాజర్ల శివరామచారి, 2022లో జాజర్ల భాస్కరాచారి అవార్డులు అందుకున్నారు. 1975 ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని నాటి సీఎం జలగం వెంగళరావు కళాకారులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 1986లో నాటి సీఎం ఎన్టీఆర్ చేతులు మీదుగా ఇక్కడి కళాకారులు అవార్డులు అందుకున్నారు. ఐలా ఆచారి చేతిలో తయారైన గావ్(కూజా) లాంటి కళాఖండాన్ని చూసిన నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ప్రధాని ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు, ప్రముఖులు శంకర్‌దయాళ్ శర్మ, కుముద్‌బెన్‌జోషి, జ్ఞానీ జైల్‌సింగ్, మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు అనేక మంది నుంచి ప్రశంసలు అందుకున్న పెంబర్తి.. నేడు జాతీయ స్థాయిలో బెస్ట్ టూరిజం ప్రాంతంగా ఎంపిక కావడంతో గ్రామస్తులు, కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పుణ్యక్షేత్రాలు.. నంది అవార్డులు ఇక్కడివే..



దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో అలంకారప్రాయంగా కనిపించే ధ్వజస్తంభాలు, కిరీటాలు, మూల విరాట్‌లు, త్రిశూలం లాంటి ఎన్నో బ్రాస్ కళాఖండాలు ఇక్కడ తయారు చేసినవే. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ప్రధాన ద్వారాల అలంకరణ, ఆలయంలో బ్రాస్, ఇత్తడి, వెండితో తయారు చేసిన అనేక కళాఖండాలు పెంబర్తి కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్నవే. అమెరికాలోని మొగల్ దర్బార్ రెస్టారెంట్‌తో పాటు వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ముఖద్వారాలు, హోర్డింగ్, ధ్వజస్తంభాలు, ఇత్తడి రేకులు తదితర కళాఖండాలు ఇక్కడ తయారై సప్తసముద్రాలు దాటి వెళ్లాయి.

రైలునుంచి దిగబోయి మహిళకు గాయాలు

- ఆస్పత్రికి తరలింపు

కాశిబుగ్గ : కదులుతున్న రైలునుంచి దిగబోయిన ఓ మహిళ. బోగి, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయింది. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో ప్రాణాపాయం తప్పి తీవ్రగాయాలైన సంఘటన వరంగల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన సుంచు రాజమణి గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో స్వగ్రామానికి వచ్చేందుకు ఆదివారం అహ్మదాబాద్–చెన్నై వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి నిద్రపోయింది. రైలు సోమవారం తెల్లవారుజామున 4.46 గంటలకు వరంగల్‌కు చేరుకుని కదులుతున్న సమయంలో ఆమె నిద్రలేచింది. తాను దిగాల్సిన స్టేషన్ దాటిపోయిందన్న హడావుడిలో కదులుతున్న రైలు నుంచి దిగబోయి కాలుజారి రైలు బోగి, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయింది. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే చైన్ లాగారు. రైలు ఆగిపోవడంతో రైల్వే పోలీసులు, ప్రయాణికులు ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుపోయిన మహిళను ప్లాట్‌ఫాం పగలకొట్టి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం ఆమెను 108 ద్వారా చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.

బంగారం ఇవ్వలేదని కక్ష సాధింపు..

- నా భర్తను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు
- జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్ భార్య కన్నీరుమున్నీరు
- గ్రీవెన్స్‌లో జీసీసీ డీఎంను నిలదీత


పీఓకు తన గోడును వెల్లబోసుకుంటున్న భాగ్యలక్ష్మి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లిలో రెండేళ్ల క్రితం నెలకొల్పిన జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్‌గా జీసీసీ సేల్స్‌మెన్ లచ్చబాబు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు రూ. 13 లక్షల వరకు అవకతవకలు జరగడంతో జీసీసీ అధికారులు గతేడాది లచ్చబాబును సస్పెండ్ చేశారు. అయితే పెట్రోల్ బంక్‌లో పనిచేసే వ్యక్తులు తనను మోసం చేశారని, రూ.13 లక్షల వరకు వారి ఖాతాల్లో ఉన్నాయని లచ్చబాబు ఆరు నెలల క్రితం జీసీసీ డీఎం ప్రతాపరెడ్డికి రాతపూర్వకంగా తెలిపారు. దీంతో జీసీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు వారు కూడా విచారణ చేపట్టారు. ఇందులో లచ్చబాబు కూడా అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. అయితే దీనిపై ఎలాంటి చర్యలు జరగలేదు. అనంతరం ఈ ఘటనపై విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ అధికారి కూడా విచారణ చేపట్టకుండా జాప్యం చేస్తూ లచ్చబాబును సస్పెన్షన్‌లోనే ఉంచారు. దీనికి విసిగి వేసారిన లచ్చబాబు భార్య భాగ్యలక్ష్మి తన కుమారుడితో కలిసి సోమవారం గ్రీవెన్స్‌కు హాజరై జీసీసీ డీఎం ప్రతాపరెడ్డిని నిలదీసింది. 'ప్రతి జనవరికి సేల్స్ మెన్లు మీకు బంగారు ఉంగరాలు ఇవ్వాలా... పది వేళ్లకు పది ఉంగరాలు పెట్టుకుంటారా' అవి ఇస్తేనే వారి జీతాలు, సమస్యలు తీర్చుతావా... అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లంచాలకు అలవాటు పడి జీసీసీ సేల్స్ మెన్లపై కక్షసాధింపు చర్యలుకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భర్త తప్పు చేస్తే జైలుకు పంపాలన్నారు. లేదా అతని వద్ద నుంచి అవకతవకలకు గురైన డబ్బులు రికవరీ చేయాలన్నారు. అలా చేయకుండా బంగారం ఇవ్వలేదని కక్షతోనే తన భర్తను జీసీసీ డీఎం వేధిస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనను చూసిన ఐటీడీఏ పీఓ అంకిత్.. వారం రోజుల్లో లచ్చబాబు సమస్య పరిష్కరించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కాగా, ఈ ఘటనతో గిరిజన దర్బార్‌కు హాజరైన అధికారులు కంగుతిన్నారు. ఈ విషయంపై జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరి వద్ద లంచం ఆశించలేదన్నారు. లచ్చబాబు జీసీసీకి ఇంకా రూ. 4.50 లక్షలు చెల్లించాల్సి ఉందని, అవి చెల్లిస్తేనే అతడిని ఉద్యోగంలోకి తీసుకుంటామన్నారు.

కేయూలో ఉద్యోగ సంఘాల సమ్మె వాయిదా

- రిజిస్ట్రార్‌తో బాధ్యుల చర్చలు
- నేడు పదోన్నతులు, కారుణ్యనియామకాలకు ఓకే


రిజిస్ట్రార్‌తో చర్చలు జరుపుతున్న ఉద్యోగ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ ఉద్యోగ సంఘాల బాధ్యులతో రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు సోమవారం రాత్రి చర్చలు జరిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తుండడంతో ఈనెల 26 నుంచి ఉద్యోగ సంఘాల ఆందోళన బాట పట్టాలని నిర్ణయించడంతో రిజిస్ట్రార్ ఉద్యోగ సంఘాల బాధ్యులను చర్చలకు ఆహ్వానించారు. చర్చల అనంతరం ఈనెల 26న పలు కేటగిరీల్లో ఉద్యోగులకు పదోన్నతులు, పలువురికి కారుణ్యనియామకాలకు ఉత్తర్వులు ఇచ్చేందుకు రిజిస్ట్రార్ అంగీకారం తెలిపారన్నారు. అలాగే మరో ఐదారు అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి నివేదిక ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను వాయిదా వేసేందుకు నిర్ణయించినట్లు కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు యాదగిరి, జనరల్ సెక్రటరీ తిరుపతి వెల్లడించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పెండ్లి అశోక్‌బాబు, హబీబుద్దీన్, కిష్టయ్య, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ షుకూర్, జనరల్ సెక్రటరీ కొర్నేలు పాల్గొన్నారు.

మహిళపై దాడి..


దాడికి పాల్పడిన కొండేటి రాజు

వర్ధన్నపేట: తనను ఆర్థికంగా దెబ్బతీసి దూరంగా ఉంచడంతోపాటు ఇంకొకరితో చనువుగా ఉంటుందనే కారణంతో ఓ వ్యక్తి.. మహిళపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వర్ధన్నపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వర్ధన్నపేట వడ్డెర కాలనీకి చెందిన ఓ మహిళ..తన భర్త మృతి చెందడంతో పుట్టినిల్లు వర్ధన్నపేటలో ఉంటోంది. కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో ట్రాక్టర్ యజమాని కొండేటి రాజుతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో ఆర్థికంగా చితికిపోవడంతో రాజు ట్రాక్టర్‌ను అమ్ముకుని డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దీంతో సదురు మహిళ.. ఆర్థికంగా వెనకబడ్డాడని రాజును దూరం పెట్టింది. దీనికి ఆగ్రహం చెందిన రాజు.. మహిళను మందలించినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని పల్లె దవాఖాన వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహం చెందిన రాజు కత్తితో మహిళపై దాడికి పాల్పడి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడిన మహిళను గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలి హుటాహుటిన 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. నిందితుడు రాజు పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బాధితురాలిని ఆస్పత్రికి తరలించామన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ లెక్చరర్లు

- కేయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లోని కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు విధులు బహిష్కరించి పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కలిపి 1445 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. గత 143 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. మంత్రులను, ప్రజాప్రతినిధులను కూడా కలిసి విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నాయకులు మధుకర్‌రావు, జరుపుల చందులాల్, చంద్రశేఖర్, జి.రమేష్, రఘువర్ధన్‌రెడ్డి, ఆర్‌డి ప్రసాద్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, వందన, శ్రీకల్పన, శ్రీలత, స్వప్న, మంజుల, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యూనివర్సిటీలోని కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిలో 36 మంది విధులు బహిష్కరించారు. అలాగే వివిధ విభాగాల్లో కొందరు విధులు బహిష్కరించగా మరికొందరు యథావిధిగా విధుల్లో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రిలే దీక్షలు

కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్(కుక్టా) జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లు రిలే నిరాహారదీక్షలు షురూ చేశారు. దీక్షలను కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ఆచార్యులు ఎం. సారంగపాణి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, కాంట్రాక్టు లెక్చరర్లు డాక్టర్ రవీందర్, మాదాసి కనకయ్య, సునీత, ప్రసాద్, రమాదేవి, డాక్టర్ కె.సాయిచరణ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వేధింపులు..

- భర్తను చితకబాదిన భార్య, అత్త..
- చికిత్స పొందుతూ మృతి
- కచ్చిర్లతండాలో ఘటన


భద్రునాయక్ (ఫైల్)

చిల్పూరు : మద్యం మత్తులో వేధింపులకు గురి చేస్తున్న భర్తను.. భార్య, అత్త చితకబాదారు. దీంతో తీవ్రగాయాలపాలైన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గార్లగడ్డ తండా పంచాయతీ పరిధిలోని కచ్చిర్ల తండాలో జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బడి తండా పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన అంగోతు భద్రునాయక్ (40) ఆదివారం సాయంత్రం తన అత్తగారి ఊరు చిల్పూరు మండలం కచ్చిర్లతండాకు వచ్చాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో తన భార్య రమ, అత్త భూలీతో గొడవ పడ్డాడు. దీనిని గమనించిన చుట్టు పక్కల వారు గొడవను వారించి వెళ్లిపోయారు. అనంతరం అర్ధరాత్రి మరోసారి ఇద్దరిపై దాడికి యత్నించాడు. దీంతో భార్య, అత్త ఎదురుదాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన భద్రునాయక్.. అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు భద్రునాయక్ మద్యం మత్తులో గతేడాది సెప్టెంబర్ 12వ తేదీన ఇదే తండాలో తన మామ లావుడ్య బాలునాయక్‌తో గొడవ పడి రోకలితో బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో భద్రునాయక్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఆదివారం కూడా మరోసారి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్య, ఆమె తల్లి ఎదురుదాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కామన్ మెస్ రీ ఓపెన్‌లో జాప్యం

- మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకున్న 39 మంది విద్యార్థులు
- నేటి నుంచి మెస్ సౌకర్యం: డైరెక్టర్ వెంకయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్ రీ ఓపెన్‌లో జాప్యం చేస్తున్నారు. పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తయిన విద్యార్థులు మూడో సెమిస్టర్‌లో ప్రవేశించారు. అయితే మెస్ బకాయిల్లో ఒక్కో విద్యార్థి కనీసం రూ.2,500ు చెల్లించి హాస్టల్ వసతితో పాటు మెస్ కార్డును రెన్యూవల్ చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై.వెంకయ్య కోరారు. కొద్ది రోజులుగా రెన్యూవల్ ప్రక్రియ జరుగుతున్నప్పటికీ సోమవారం వరకు 39 మంది విద్యార్థులే మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకున్నారు. కనీసం 100 మంది అయినా రెన్యూవల్ చేసుకుంటే కామన్ మెస్‌ను తెరుస్తామని వెంకయ్య తెలిపారు. అయితే ఇప్పటికే మెస్‌కార్డులు పొందిన విద్యార్థులు కామన్ మెస్ ఓపెన్ చేయకపోయేసరికి ఇబ్బందులు పడుతున్నారు. తమకు మెస్ ఓపెన్ చేయాలని సోమవారం రెన్యూవల్ చేసుకున్న వారు హాస్టళ్ల డైరెక్టర్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఈనెల 26 మధ్యాహ్నం నుంచి మెస్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా క్యాంపస్‌లో పద్మాక్షి మహిళా హాస్టల్ మెస్, ఇంజనీరింగ్ విద్యార్థుల మెస్ ఇప్పటికే రీ ఓపెన్ అయ్యాయి.

హాకథాన్ విజయవంతం


హాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో సోమవారం 12 గంటలు నిర్వహించిన హాకథాన్ విజయవంతమైంది. ఎస్సార్ కళాశాలతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్విరామంగా 12 గంటలు సాగింది. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరుచుకుని ముందుకు దూసుకుపోవడం హాకథాన్ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ కోడింగ్‌పై నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ శశికళ, డాక్టర్ శివకృష్ణారెడ్డి, డాక్టర్ అలీ, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లు

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కాళోజీ పురస్కార గ్రహీత జయరాజ్‌కు ఆత్మీయ సన్మానం


జయరాజ్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

మహబూబాబాద్: సీఎం కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లని, తెలంగాణ ఏర్పాటు అనంతరమే కవులు , కళాకారులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాకవి, గాయకుడు, కాళోజీ పురస్కార గ్రహీత గొడిశాల జయరాజ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అధ్యక్షత వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళోజీ పురస్కార గ్రహీత జయరాజ్‌ను సన్మానించడం సమాజాన్ని గౌరవించినట్లేనన్నారు. సమాజ చైతన్యంలో జయరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం విశిష్ట అతిథి సీఎం ఓఎస్‌డీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంపై నిర్లక్ష్యమే తనను ఉద్యమం వైపు నడిపించిందన్నారు. పోరాటాలతో తెలంగాణ ఏర్పాటైందన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి మాట్లాడుతూ మానుకోట బిడ్డ జయరాజ్‌కు అవార్డు రావడం హర్షణీయమన్నారు. స్వరాష్ట్రంలో కవులు, కళాకారులకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ జయరాజ్‌కు అవార్డు రావడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాళోజీ పురస్కార గ్రహీత , ప్రజాకవి, గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ దాశరథిలా జీవిస్తానని, కాళోజీలా ప్రశ్నిస్తానన్నారు. కాళోజీ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటుతోనే తనకు అవార్డు వచ్చిందన్నారు. తన తల్లిదండ్రుల కష్టాలను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అంతకుముందు తాండవ కృష్ణ నృత్య అకాడమీ విద్యార్థులు స్వాగత నృత్యం చేయగా, మరిపెడ, నెల్లికుదురు కేజీబీవీల విద్యార్థినులు, కురవి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నృత్యం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ కె శశాంక, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ టి ప్రసన్న రాణి, బానోత్ రవికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, డీఈఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.